E 4/1 For favour of Review

# హేతుత్వం-మతతత్వం

Cat-14457

రావిపూడి వెంకటాద్రి

హేతువాది వ్యాసవాణి-8

# హేతువాది వ్యాసవాణి

మతాలన్నీ శాస్త్ర జ్ఞానాన్ని నిరోధించడానికి కొత్తమార్గాలు వెదుకుతున్నై. అందులో భాగంగా శాస్త్రాన్నీ, చరిత్రనీ వక్రీకరించి దుష్ట సాహిత్యాన్ని సృష్టిస్తున్నై. శాస్త్రీయవైజ్ఞానికసాహిత్య సృష్టితో ఆ ఉప్పెనకు అడ్డుకట్టవేయకపోతే, ఇన్నాళ్ళుగా మానవుడు సాధించుకున్న విజ్ఞాన నిధి ఊడ్చుకుపోతుంది. మాటల్లో శాస్త్రాన్నీ, భావంలో మతాన్నీ, అక్షరాల్లో అద్వైతాన్నీ, అర్థంలో వర్ణ వ్యత్యాసాన్నీ పోషించే ద్వంద్వ వైఖరిని ఉపేక్షించడం మానవ ప్రగతికే హానికరం. దాన్ని కొనసాగనీయకుండా చేయడానికి ఆంధ్రప్రదేశ్ హేతువాద సంఘం అందరికే అందికలో వుండగల చిన్నచిన్న పుస్తకాల ప్రచురణ చేపట్టింది. ఆ మేరకు ప్రారంభమైన "హేతువాది వ్యాసవాణి" సీరీస్‌లో ఇది ఎనిమిదవది. ఈ సీరీస్‌లో రావిపూడి ప్రచురణలు :

| | | |
|---|---|---|
| 1. | శాస్త్రం-మతం | రు. 2-00 |
| 2. | జ్యోతిషం శాస్త్రమా ? | 2-50 |
| 3. | శంకరాచార్యుడి హత్య | 2-00 |
| 4. | శాస్త్రం - పురాణం | 2-00 |
| 5. | ఐన్‌స్టీన్ : మతం - దైవం | 3 00 |
| 6. | హేతువాదం - అజ్ఞేయవాదం | 3-00 |
| 7. | నాస్తికులున్నారు జాగ్రత్త! | 6-00 |
| 8. | హేతుత్వం - మతతత్వం | 3-00 |

కాపీలకు :—

రావిపూడి వెంకటాద్రి
ఎడిటర్, హేతువాది
చీరాల - 523 155

# హేతుత్వం - మతతత్వం

రావిపూడి వెంకటాద్రి

కవిరాజాశ్రమం
నాగండ్ల

తొలి ముద్రణ : ఆగస్టు 1980
మలి ముద్రణ : జూన్ 1985

హక్కులు : గ్రంధకర్తవి

వెల : రూ. 3/-

ఈ పుస్తక శ్రేణిలో చదువవలసినవి :

హేతువాదం
నాస్తికత్వం - నాస్తితత్వం
నాస్తికులున్నారు, జాగ్రత్త!
హేతువాదవైఖరి
హేతువాదం - అజ్ఞేయవాదం

గ్రంథాలయ
81045
హైదరాబాద్-500 044

ముద్రణ :
సాయి ప్రింటింగ్ ప్రెస్,
పేరాల - 523 157

# ఒక్క మాట :

**Seek not to understand that you may believe, but be ieve that you may understand** అన్నాడు సెయింట్ అగస్టీన్. ఇలా "నమ్మడంకోసం అర్థంచేసుకోవద్దు. అర్థం చేసుకోవడం కోసం నమ్ము" అని చెప్పేది మతం. అర్థంచేసుకొని సమ్మతించడం, లేక తిరస్కరించడం శాస్త్ర పద్ధతి, హేతుపద్ధతి. నమ్మిన తర్వాత అర్థంచేసుకోవడమంటే, నమ్మినదాన్ని సమర్థించుకోడానికీ, నిలదొక్కడానికీ భజన పద్ధతుల్ని కనిపెట్టడమే. నమ్మిన తర్వాత ఇంకా అర్థం చేసుకొనేదేమిటి? మానవుడికి వివేచనాశక్తి వున్నది కేవలం మూఢంగా నమ్మడానికికాదు. వివేచించి సమ్మతించిన తర్వాత నమ్మకం విషయం వస్తుంది. నమ్మకానికి విరుద్ధమైన రుజువులు దొరికినపుడు ఆ నమ్మకాన్ని త్యజించడానికి వెనుకాడడం మతపద్ధతి, దానికి భిన్నమైనది హేతుపద్ధతి.

పాత నమ్మకాలను ప్రశ్నించి, సమాధానాలను పరిశీలించి, శాస్త్రీయ దృక్పథంతో వివేచించి, కొత్త నిర్ణయాలను చేసుకొంటూ ఇన్నాళ్ళుగా మానవుడు సాగించిన మనుగడలోనే నాగరికత, సంస్కృతి పుట్టినై. మానవుడి ఆలోచనకు చరిత్ర లేకపోతే, సంస్కృతికి - నాగరికతకు చరిత్రలేదు. సంస్కారమనేది నిత్యనూతనమైనదికాగా, మారని మత సంస్కృతి మృత సంస్కృతే. ముందుకో, వెనక్కో నడవకుండా - ఉన్నచోటనే ఉండే పాషండ స్థితికి చరిత్ర వుండదు. మానవుడు చరిత్రను సృష్టిస్తున్నాడంటే-అతని ఆలోచన, తదనుగుణంగా అతని

ప్రవర్తన ముందుకో, వెనక్కో సాగుతున్నదనే అర్థం. ఈ గమనం లోని మజిలీలే సిద్ధాంతాలూ, మతాలూ. మజిలీలనే గమ్యాలుగా భావించి విశ్రమించడంవల్ల గమనం అనేది అసంభావ్యమవుతుంది. అది మానవ పద్ధతికావని హేతువాదం అంటుంది. నిరంతర పురోగమనం మానవ పద్ధతి.

అవసరాలు, ఉద్వేగాలు మనుషులకేకాదు, పశుపక్ష్యాదులకుకూడా వున్నాయి. వాటిని తీర్చుకోవడంలో వివేకాన్ని (reason) ప్రదర్శించడం మనిషి ప్రత్యేకత. ఆ వివేక చరిత్రే మానవ చరిత్ర. వివేకంతో నిమిత్తంలేకుండా ఉద్వేగాల తృప్తితో ముడుచుకొనేది మానవ సమాజం కాదు. జంతు సమాజం. ప్రతి మతమూ ఉద్వేగాలను పోషిస్తుంది. మతమే ఉద్వేగంగా రూపొందుతుంది. రాగద్వేషరహితంగా ప్రపంచాన్ని చూడటం "మతానికి" చేతకాదు. జాతి, మత, కుల, వర్గ తత్త్వాలన్నీ ఉద్వేగ మూలకాలే. వాటితో సహజన్మమెత్తే అసహనం మానవుల మధ్య ఎంతటి విద్వేషాన్ని పోషించిందో, ఎన్ని అత్యాచారాలను పురి కొల్పిందో, చరిత్రజ్ఞులకు తెలియని విషయంకాదు. మతాలమధ్య, మత శాఖలమధ్య జరిగిన సంఘర్షణ హింసకు హత్యలకు దారితీసిందేతప్ప,వాటి మధ్య ఘర్షణ ఫలితంగా అవి అంతర్ధానం కాలేదు. జాతులమధ్య, వర్గాల మధ్య, కులాలమధ్య జరిగిన సంఘర్షణ ఆశక్తుల్ని నాశనం చేయజాలదని దాన్నిబట్టి తేలుతుంది. జాతి మత కుల వర్గ వాదాలన్నీ ఉద్వేగాలకు (అరిషడ్వర్గాలకు) పగ్గాలు వదలినవే. ఉద్వేగాన్ని ఉన్మాదస్థాయికి చేర్చినవే. ఆ ఉద్వేగమే వాటికి ప్రాణంకూడా. నిజానికి ఉద్వేగాల పగ్గాలు హేతుత్వం స్వాధీనంలో ఉండకపోయినట్లయితే, మనమింకా అడవుల్లోనే వుండిపోయేవాళ్ళం. వివేకం పనిచేయడం ప్రారంభమైన

తర్వాతకూడా మతోద్వేగం దాన్ని తొక్కిపెడుతూనే వస్తున్నది. పైగా, మతేతర విషయాల్లోకూడా మతవారసత్వమే పనిచేస్తూ, అనేక అరిష్టాలకు దారితీస్తున్నది. నిజానికి పాశవికవారసత్వమైన ఉద్వేగం మానవికమైన వివేకంకంటె స్థిరతరస్వభావం కలది. అగుడ్డిబలంవల్లనే వివేకాన్ని రైకట్ట నీయకుండా మతసమాజం కొనసాగుతూవుంది. వివేకంయొక్క బలాన్ని మనం యే మేరకు పెంచుకొంటామో, ఆ మేరకు ఆదర్శ మానవ సమాజానికి దగ్గరవుతాం. ఆదర్శ మానవ సమాజానికి హేతువాదమార్గంతప్ప, వేరే అడ్డదారిలేదు. అడ్డదారులన్నీ తిరిగి మతాలుగా పరిణమిస్తాయి. చివరకు మతాలన్నీ భావనియంత్రృత్వాలుగా తీరికూర్చుంటాయి. ఆలోచనలో స్వేచ్ఛ, ఆచరణలో స్వేచ్ఛ హేతువాదానికి మూలాధారంకాబట్టి, అన్ని నియంత్రృత్వాలతోపాటు (మత) భావనియంత్రృత్వాన్నికూడా హేతువాదం వ్యతిరేకిస్తుంది. అంటే హేతువాదం స్వేచ్ఛావాదమన్నమాట. మానవుడు అనుభవజ్ఞానంతో, శాస్త్రజ్ఞానంతో, హేతుత్వం సాధనంగా ఎలాంటి నిర్ణయాలు చేసుకోడానికి వీలవుతుందో సూచించడానికి "హేతుత్వం-మతతత్వం" అనే యీ వ్యాసంలో ప్రయత్నించడం జరిగింది. 1978-79లో "హేతువాదం" మీద "చార్వాక" మాసపత్రికలో సీరియల్‌గా వ్రాసిన వ్యాసపరంపరలో ఇది చివరిది. ఉద్యమావసరాల కోసం ఈ భాగాన్ని మొదట 1980లో విడిగా చిన్న పుస్తకంగా ప్రచురించాం. (మిగతాభాగం "హేతువాదం" పేర మరో పుస్తకరూపంలో వెలువడింది) ఇప్పుడు "హేతుత్వం - మతతత్వం" యథాతథంగా "హేతువాది వ్యాసవాణి"లో పునర్ముద్రిత మవుతున్నది.

హేతువాదం గురించి నా అభిప్రాయాల్లో స్పష్టత చేకూర్చుకోడానికి,

ఆ రూపంగా ఇతరుల అభిప్రాయాల్లో స్పష్టతను ప్రోత్సహించడానికి నేను చేసిన ప్రయత్నాల ఫలితంగా శాస్త్రం–మతం, హేతువాదం–నాస్తికత్వం మీద మరికొన్ని గ్రంధాలుకూడా వెలువడినై. దీనితోపాటు వాటినికూడా కలిపి చదవడంవల్ల నా అభిప్రాయాలు మరికొంత విశదమవుతాయి. ఇందులో ఏమైనా పొరపాట్లున్నట్లు గుర్తిస్తే వాటిని నాదృష్టికి తేవలసిందిగా పాఠక మిత్రులకు విజ్ఞప్తిచేస్తున్నాను.

ఇట్లు,

రావిపూడి వెంకటాద్రి

అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ హేతువాద సంఘం,

ఉపాధ్యక్షులు, భారత హేతువాద సంఘం.

కవిరాజాశ్రమం
నాగండ్ల
5-6-85

# హేతుత్వం - మతతత్వం

Where thou findest a lie that is oppressing thee, extinguish it. Lies exist only to be extinguished; they wait and cry earnestly for extinction. —Thomas Carlyle.

Dislike of lying is the root of Rationalism. Like all ethics, it begins in self-interest; we dislike being lied to as we dislike being assaulted, robbed, or swindled. —Archibald Robertson.

హేతువాదమనేది ఒక వాదమా? లేక జీవిత విధానమా? అదొక జీవిత విధానం కాకపోతే, హేతువాదంవల్ల ప్రయోజనమేమున్నది? అనే ప్రశ్నల్ని మనం వేర్వేరు రూపాల్లో వింటుంటాం.

హేతువాదమనేది ఒక ఆలోచనా వైఖరి (attitude) - ఆలోచనా విధానం. జ్ఞానార్జనకు సాధనం. హేతుత్వం సాధనంగా తప్ప ఆలోచించడానికి వీలులేదు. హేతుత్వం పనిచేయనప్పుడు ఆలోచన స్తంభించిపోతుంది. తప్పుడు ప్రమేయాల (premises) మీదనుంచి జరిగే ఆలోచన అహేతుక మార్గాన ప్రయాణిస్తుంది. అప్పుడుచేసే వాదన అంతా కుతర్కానికి సంబంధించిన దవుతుందికాని, హేతుత్వానికి సంబంధించినదికాదు. అందువల్ల అహేతుక నిర్ణయాలకు దారితీసే కేవల తర్కాన్నే హేతువాదంగా గుర్తించడానికి వీలులేదు. అంటే ప్రమేయాలు కూడా హేతుబద్ధమైనవి కావాలని దీని భావం.

శాస్త్రం, శాస్త్రజ్ఞానమనేవి హేతుబద్ధమైనవి. హేతు రహితంగా

వాటి వునికి అనూహ్యం. అందువల్ల సహేతుక ఆలోచన యెల్లప్పుడూ శాస్త్రీయ దృక్పథంలోనే వుంటుంది. పురాకృత (a priori) నిర్ణయాల మీద ఆధారపడి శాస్త్రజ్ఞానం పెంపొందదు. శాస్త్రజ్ఞానం, విజ్ఞానం పెరిగే కొలదీ విషయాలమీద మనం తీసుకొనే నిర్ణయాల్లో అవశ్యంగా మార్పు గోచరిస్తుంది. ఆలోచనతోపాటు నిర్ణయాలుకూడా క్రమంగా సమగ్రత వైపు ప్రయాణం చేస్తాయి మత తత్వమూ (Religiousity), హఠ వాదమూ (Dogmaticism) విజ్ఞాన ప్రగతిని జమకట్టుకోకపోవడంవల్ల అహేతుకత్వంలో, మౌఢ్యంలో మునిగితేలుతూ వుంటాయి. అందువల్ల అవి మూర్ఖత్వం, క్రౌర్యం, హింసాప్రవృత్తి, అహంకారం, అసహనం కక్ష వంటి దుర్లక్షణాల ప్రేరణకు మూలమవుతాయి.

హేతువాదం ఒక ఆలోచనావిధానమంటున్నామంటే, అది మన జీవిత విధాన నిర్ణయానికి సాధనమనే అర్థం. ఆ జీవిత తత్వం లౌకిక తత్వంగా మాత్రమే వుండగలుగుతుందని దాని తాత్పర్యం. అందువల్ల హేతువాదాన్ని ఒక జీవిత తత్వం (Philosophy of life)గా భావించ డంలో అసందర్భమేమీలేదు.

అందువల్లనే బ్రిటిష్ రేషనలిస్టు ప్రెస్ అసోసియేషన్‌వారు హేతు వాదాన్ని చాల అర్థవంతంగా, బహుథా అభ్యుదయ వ్యాఖ్యానం చేయ డానికి అనువుగా నిర్వచించారు.

Rationalism may be defined as the mental attitude which unreservedly accepts the supremacy of reason and aims at establishing a system of philosophy and ethics verifiable by experience and independent of all arbitrary assumptions or authority.

—(Memorandum of the R.P.A.)

ఈ నిర్వచనంలో మనకు మూడు ముఖ్యాంశాలు కన్పిస్తున్నాయి.

1. హేతువాద మనేది ఒక మానసిక వైఖరి.

2. అది హేతువుయొక్క సర్వాధిక్యతను నిర్నిబంధంగా ఆమోదిస్తుంది.

3. అన్నిరకాల అహేతుక భావనలకూ, ప్రమాణాలకూ దూరంగావుంటి, అనుభవంద్వారా మాత్రమే నిరూపణ చేసుకోదానికి వీలయిన తత్వజ్ఞానాన్నీ, నీతిశాస్త్రాన్నీ నిర్మించుకోవడమే దాని లక్ష్యం.

కాబట్టి హేతువాదమనేది తత్వజ్ఞానానికి అద్వితీయమయిన సాధన మనీ, జీవితతత్వ నిర్ణయానికి యేకైక మార్గమనీ తేలుతుంది.

హేతువాదులంతా సమానంగా అంగీకరించే సామాన్య విషయా లెన్నో మానవుడి సర్వతోముఖ జీవితరంగంలో వ్యాపించివున్నాయి. మానవచరిత్రను క్రమంగా వెనక్కు చదువుకొంటూపోతే, ఆదిమానవుడి నుంచి నేటివరకూ యెడతెగకుండా ప్రవహించిన ఆలోచనాధార అంతా ఒకేఒక్క తత్వశాస్త్రమేనని తేలుతుంది. అందులో కొంత "మత ఛండాలం" వుంటే. మనం మరికొంత "మత వ్యతిరేక ఛండాలం" సృష్టించి దానికి కలిపినందువల్ల ఆ మత ఛండాలం అంతంకాదు. బహు భిన్నమత శాఖల అవతరణ, అంతర్మత కలహాలూ ఆ పని చేసినవే. పూర్వమత ఛండాలాన్ని నిర్మూలించడానికి నవ్యమత ఛండాలాన్ని సృష్టించినవే. కానీ అన్ని మతశాఖలూ పరస్పరం నికృష్టస్థాయిలో కలహించుకొంటూ స్వ పర మత ఛండాలాల్లో అలాగే పొర్లాడుతున్నాయి. హేతువాదంతో పునాదులు బిగించుకవస్తేతప్ప, మూఢ మత ఆలోచనా విధానంనుంచి బయటపడడం సాధ్యంకాదు.

అయితే, నేటి సామాజిక జీవనంలోని రాజకీయ-ఆర్థిక వాత్తిడుల్లో జీవిత విలువల అర్ధమే మారిపోయింది. తాత్విక జిజ్ఞాస ప్రాముఖ్యత నిర్లక్ష్యం చేయబడింది. భావ వికాసం అప్రధానమయిపోయింది. రాజకీయ-ఆర్థిక కేంద్ర దృక్పథం జీవితంలో ప్రధానమయిపోయింది-కాదు కాదు, ఆ దృక్పథమే జీవితమయిపోయింది. కానీ, నిజానికి జీవితం బహుముఖమైనది. రాజకీయ ఆర్థిక సమస్యలు యెంత అవసరమయి నప్పటికీ, కేవలం అవిమాత్రమే జీవితాంశాలుకాదు. కానీ, యీనాడు "అహేతుక రాజకీయ విషవలయం"లో చిక్కుకొనే దౌర్భాగ్యస్థితికి మనం చేరుకోవడంవల్ల మానవ జీవిత విధానాన్ని నిర్ణయించే తాత్విక దృక్పథాన్ని చేరుకోవడంలో మనం అహేతుకతలోనే మునిగి తేలుతున్నాం. అందువల్ల భావవిప్లవానికి బదులు భావ స్తంభననూ, ప్రతిష్టంభననూ చూస్తున్నాం. భావ విప్లవ వ్యతిరేక శక్తుల విజృంభణను నిస్తబ్ధతతో తిలకిస్తున్నాం.

ఆ స్తబ్ధతను తొలగించి జీవిత విలువల స్పృహను కలిగించే జీవితతత్వాన్ని నిర్మించుకోడానికీ, తదనుగుణంగా ప్రవర్తించడానికీ అవశ్యంగా హేతుత్వాన్ని అనుసరించాలి; హేతువాద మార్గంలో పురోగమించాలి. మనలో మనసా - వాచా - కర్మణా హేతువాద వైఖరి ప్రతిబింబించాలి.

అయితే, హేతువాదం మానవుడికి అవశ్యంగా చూపే తాత్విక జీవన విధానమేమిటి? దాని నిర్ణయాలెలా వుంటాయి? అది యేరకమయిన ఆచరణను ప్రోత్సహిస్తుంది? అనే ప్రశ్నలుకూడా తరచు మనం వింటుంటాం. వానికి సమాధానం మనం ఇలా చెప్పుకోవచ్చు.

❁ హేతువాదం నేరుగా లౌకిక మార్గానుసరణకు దారితీస్తుంది.

❁ హేతువాదం ప్రకారం యీ ప్రపంచంవుంది.

❁ ఈ ప్రపంచం ఒక్కటే వాస్తవికం. యావత్ అస్తిత్వం యిందులో భాగమే.

❁ ఈ ప్రపంచానికి వెలుపల సృష్టికర్త అనేవాడు లేడు.

❁ కర్త, భర్త, హర్త, అనేవి సృష్టి, స్థితి, లయాల పేరుతో కల్పించబడ్డ వూహలు. వూహలుగాతప్ప వాటికి అస్తిత్వంలేదు. నిజానికి అవి పరిణామంలో వున్న పదార్థం త్రిదశల్లో ప్రకటించే త్రివిధ ప్రవృత్తులే. విశ్వాతీత శక్తులంటూ యేమీలేవు.

❁ విశ్వం స్వయం సంపూర్ణం, స్వయంకారణం, స్వయం స్థితం, స్వయం నియమబద్ధం; స్వయం పరిణామశీలం.

❁ విశ్వం శాశ్వతం, పరిణామం నిరంతరాయం.

❁విశ్వంలో సర్వమూ భౌతికమైనట్టిదేకాని భౌతికాతీతమైనదేమీలేదు

❁ మనిషినికానీ, ఇతర జీవరాసులనుకానీ సృష్టించాడని చెప్పబడుతున్న దేవుడనేవాడులేడు, అతడీసృష్టికి కారణంకాదు; జీవోత్పత్తికి కారణంకాదు.

❁ జీవోత్పత్తికూడా ప్రకృతి పరిణామంలో భాగమే. ఆ జీవ పరిణామంలోవచ్చిన ఆకస్మిక వికారాల (Mutations) వల్ల అనేకరకాల జీవజాతులు వుత్పన్నమైనాయి. క్రమంగా పై తరగతులకు చేరుకొనే కొలదీ జీవజాతుల్లో మానసిక వికాసం క్రమాధికంగా ప్రకటితమైంది. అందులో యెక్కువ మానసిక వికాసంకల మనిషిజాతిని వున్నత పరిణామదశగా భావించడం జరిగింది.

❁ జీవమనేది పదార్థాన్ని ఆశ్రయించివుండే ధర్మమేకాని, పదార్థానికి

విడిగానూ, పదార్థ ప్రవృత్తికి భిన్నంగానూ వుండేదికాదు. ఒక ప్రత్యేక రీతిలో నిర్మాణమైవున్న పదార్థం ప్రకటించే లక్షణాన్నే మనం జీవం అంటాం.

• ఆత్మ అనేది ప్రత్యేకంగావుండే వస్తువేమీకాదు. మనం మనస్సు అనేదాన్నే మన పూర్వులు దైవీకరణం (deify) చేసి, ఆత్మగా మార్చి వేశారు. జీవంలేకుండా ఆత్మ (మనస్సు) అనేదిలేదు. మెదడు అనేది కూడా జీవపరిణామక్రమంలో ఒకప్పుడు ఆకస్మిక వికారంగా ప్రవేశించి వదే. కాబట్టి మనస్సు, ఆలోచన, అనేవి జీవించివున్న జంతువుల (మనుషుల) మెదళ్లు చేసే వ్యాపారాలే.

• అందువల్ల ఆత్మ-పరమాత్మ అనబడేవి భావదోషంవల్ల పర్యవసించిన భాషాదోషాలు.

• జనన మరణాలనేవికూడా జీవ పరిణామంలోని రెండు దశలు. అందువల్ల మరణించిన తర్వాత జీవించడమనేదిలేదు; ఆలోచించడమనేది లేదు.

• ఆత్మకు అమరత్వం కల్పించడం ఆలోచనాదోషం.

• అందువల్ల మనుషులు (జీవులు) చచ్చినతర్వాత తిరిగిపుడతారనే పునర్జన్మ భావంతప్పు. ఆత్మలు దయ్యాలుగామారి తిరుగుతూవుంటాయనే అభిప్రాయంకూడా తప్పు. అవి వాస్తవాలుకావు. వాటిని శాస్త్రం అంగీకరించదు.

• పూర్వం ఆత్మ గుండె స్థానంలో వుండేదని భావించేవారు. దాన్ని పదార్థంగా భావించడంవల్లనే జీవి మరణానంతరం దాని ఆకలి తీర్చడానికి పిండప్రదానాలు చేసేవారు. ఆ ఆటవిక విజ్ఞానానికి మూలం అజ్ఞానం,

శరీరతత్వంలో వచ్చే రసాయనిక మార్పునే మరణమంటారు. మరణం ఫలితంగా శరీరంలో వచ్చే రసాయనిక భౌతిక మార్పులు అనేకంగా వుంటాయి.

❁ అతీంద్రియ శక్తులు (Extra Sensuary Powers) అనేవి లేవు. శక్తులన్నీ భౌతికాలే అభౌతికశక్తులుండడానికి వీలులేదు.

❁ అంతరింద్రియశక్తి (Intution) ద్వారా విషయాలను గ్రహించేడ మనేది అబద్ధం. పంచేంద్రియాల గ్రహణంమీద మనస్సు ప్రతీక రిస్తుంది. మననం (reflection) చేస్తుంది. అందువల్ల యేర్పడిన భావాలే అన్నిరకాల భావాలకూ మూలం. అంతరింద్రియ జ్ఞానానికికూడా మూలం బాహ్యేంద్రియ జ్ఞానమే. అంతరింద్రియాలద్వారా అణు విజ్ఞానాన్నికానీ, విశ్వతత్వజ్ఞానాన్నికానీ, మరేవిజ్ఞానాన్నికానీ సాధించిన యోగులెవ్వరూలేరు. అలా సాధించబడినదని చెప్పబడుతున్న పూర్వార జ్ఞానమంతా అజ్ఞానమే. "సంకల్పశక్తి" (will power) అనబడే దానివల్ల మనం భాషలనే నేర్వలేము. సంకల్పం భౌతికతకు అతీతమైన ధర్మంకాదు.

❁ మానవ జీవితమంతా ముందుగానే నిర్ణయమైవుంటుందనే కర్మవాదం (fatalism) కానీ, గ్రహనక్షత్రాదులు యెలా శాసిస్తే అలా మన జీవితాలు తిరిగిపోతుంటాయనే జ్యోతిర్వేదం (Astrology) కానీ నిజాలుకావు. జ్యోతిషాన్నీ, ఖగోళవిజ్ఞానాన్నీ, (Astronomy) ఒకే గాటకట్టివేయడం అజ్ఞానం.

❁ అలానే హస్తసాముద్రికం, పుట్టుమచ్చలశాస్త్రం, (ఇడ-పింగళ) నాడీశాస్త్రం, కేరళ జోస్యం, సంఖ్యాజోస్యం, సోదె, పక్షి జోస్యం, పుష్పజోస్యం మొదలయిన పద్ధతులన్నీ వంచనతో సాగుతున్నవే కాని, అవి సూచించే ఫలితాలనేవి నిజాలుకావు.

❀ దయ్యాలూ, భూతాలూలేవు. స్వర్గ, నరక, మోక్ష లోకాలులేవు. పితృలోకాలులేవు. సిద్ధ, సాధ్య, యక్ష, గరుడ, గంధర్వ, కిన్నర, కింపురుష, విద్యాధరాది అఖిలఖేచరకోటిలోకాలులేవు. పాలు, పెరుగు, నేతి సముద్రాలులేవు. ద్రాక్షరసం నదులులేవు.

❀పంచభూతాలవాదం ఆదిమపదార్థవాదం (Primitive Materialism). గాలి, నేల, నీరు, నిప్పు, నింగి అనేవి భూతాలు (Elements) కావు. ఆ రోజుల్లో భూతాలు నాలుగా, ఐదా, ఆరా, యేడా అనే వివాదంకూడా చెలరేగింది.

❀ ఈనాడు పదార్థ విజ్ఞానశాస్త్రం ప్రకారం భూమిమీద 92 భూతాలు (మూలద్రవ్యాలు) వున్నాయి. పైగా భూమిమీద దొరకని మూలద్రవ్యాలను డజనుకుపైగా యిప్పటికే శాస్త్రజ్ఞులు ప్రయోగశాలల్లో కృత్రిమంగా సృష్టించారు. శాస్త్రజ్ఞులు యింకా అసలయిన ప్రాథమిక కణాల అన్వేషణలో వున్నారు. అందువల్ల పూర్వుల పాంచభౌతిక వాదం చెల్లని నాణెమే. అది చెల్లాలంటే మనం ఆ కాలానికివెళ్లి మార్చుకోవాలి.

❀ ఏ నిరూపణ అయినా ప్రయోగశాలల్లోకావాలికాని, యోగశాలల్లో తేలదు.

❀ మహిమలనబడేవిలేవు. మనకు తెలియనంతమాత్రాన కొన్ని విషయాలను అతీతశక్తులకు ఆపాదించడం వివేకలక్షణంకాదు: మనిషి లక్షణంకాదు. మూఢవిశ్వాసం మనిషిని పశువుకు దగ్గరగా చేరుస్తుంది. మహిమల పేరుతో బాబాలవంటివారు ప్రదర్శించే తంతులన్నీ గారడీ పనులే. అవి మహిమలనేవారంతా వంచకులు లేక వంచితులు.

☙ మంత్రబలం, మంత్రశక్తి అనేవిలేవు. అవి అబద్ధాలు. వాటిలో ఆధ్యాత్మికత యేమీలేదు; ఆధ్యాత్మికత అనబడేదే అసలులేదు.

☙ చేతబడులు బాణామతి వంటివి కృతక వ్యాపారాలు.

☙ ప్రకృతి పై పరీక్ష్యాలను భౌతికమైనవిగా అర్థంచేసుకోవలెనేకాని, వాటిని అతీతశక్తుల దుశ్చర్యలకు ఫలితాలుగా భావించడం పొరపాటు. అసహజ (abnormal) వికృత పరిణామాలను అతీతమైనవిగా భావించడం అజ్ఞానం.

☙ పూనకాల్లో కొన్ని దైహికప్రకోపాలే; ఐనా, అధికభాగం కృతకాలు; కావాలని చేసే వికారచేష్టలు.

☙ దైహిక వికారాలూ, మానసిక వికారాలూ అన్నీ భౌతికమైనవే. భౌతిక పరిస్థితులవల్ల ప్రభావితమయ్యేవే

☙ మతాలను అనుసరించడం అజ్ఞానం. కులాలను పాటించడం హేయం.

☙ సూర్యచంద్రగ్రహణాలు ప్రకృతిసిద్ధ భౌతిక సంఘటనలు. వాటిని ముందుగా చెప్పగలగడం యీనాడు పెద్ద శాస్త్రంగా పరిగణించరు. వాటివల్ల అరిష్టాలురావు. జరిగేవేవయినా శాంతులవల్ల ఆగవు.

☙ పూర్వుల ఖగోళ విజ్ఞానం చాలాపరిమితం. దాన్ని మతంకొనివేసి జ్యోతిషరూపంలో అమ్మకానికి పెట్టింది.

☙ విశ్వం అన్నివిధాలుగాను అనంతమైనది. దాన్ని అనంతంగా తెలుసుకొంటూనేవుంటాం. తెలియనిది తెలియనిదిగానే వుండిపోదు. మనకు తెలియనంతమాత్రాన విషయాలు మహిమలయిపోవు. మనకు తెలిసిన దానికంటె తెలియనిదే యెక్కువ.

ⓘ మతగ్రంథాలన్నిటిలోను ఆదిమ విజ్ఞానం కొంత క్రోడీకరించ బడివుంది. ఈనాటి ప్రమాణాల ప్రకారం అందులో మనకి పనికివచ్చేది అత్యంతస్వల్పం.

ⓘ మతప్రవక్తలంతా తమ కాలానికి ముందున్న మతాలను ఖండించి వ్యతిరేకించినవారే; వాటినాశనానికి కృషిచేసినవారే. ఆ జ్ఞానం - అంటే అలా జరిగిందన్న (చారిత్రక) జ్ఞానం నేటి మతస్తులకులేదు. వుంటే వారు మతస్తులయ్యేవారుకాదు. ప్రవక్తలు చెప్పిన ఆకాయ పోకాయ కబుర్లన్నీ పరమసత్యాలనడం పరమఅసత్యం.

ⓘ ప్రతి అంశాన్నీ శాస్త్రీయ దృక్పథంతో పరిశీలించి నిర్ణయించు కోవాలి. తప్పుడు విషయాలనూ, అసత్యాలనూ శాస్త్రజ్ఞానంతో సమర్థించుకోబూనడం అమానుషం. మానవత్వానికి అవమానం. మాన వత్వంపట్ల నేరం. మనుషులను గాడిదల మట్టంలోకి లాక్కుపోయేవి అలాంటిచర్యలే.

ఇలాంటి నిర్ణయాలన్నీ, నిర్ధారణలన్నీ, శాస్త్రీయమైనవి, వైజ్ఞానిక మైనవి. ఇవే మన జీవితతత్వాన్ని నిర్ణయించాలి. హేతుత్వం జీర్ణించు కొన్నవాడు అహేతుకంగా ప్రవర్తించజాలడు. అవగాహన చేసుకొన్న ప్రతివ్యక్తి సహేతుకంగానే ప్రవర్తించగలడు.

హేతుత్వం-తద్వారా మానవ జీవితతత్వం అవగాహన అయిన నాడు నీతికి పునాదులేర్పడతాయి. ఏది నీతి? అని ప్రశ్నించుకోగలిగిననాడు యేది మానవత? అనే ప్రశ్న వస్తుంది. ఏది రాజకీయం? ఏది ఆర్థిక మార్గం? ఏది మానవతా సమాజం? అనే ప్రశ్నలుకూడా వస్తాయి. ఆ ప్రశ్నలకు సమాధానంగానే హేతువాద రాజకీయ, ఆర్థిక, సాంఘిక నిర్మాణ సూత్రాలు బయటకు వస్తాయి. అప్పుడు మన ఆలోచనలు -

అవి రాజకీయపరమైనవైనా, ఆర్థిక పరమైనవైనా, సాంఘిక పరమైనవైనా-అధికార పీఠాన్ని వుద్దేశించే అవకాశవాద సోపానాలు కాకుండాపోతాయి.

ఈ రోజు మనిషి తనకూ, సంఘానికీ, ప్రకృతికీమధ్య పరస్పరంగా వున్న సంబంధాన్ని తెలుసుకోలేకపోవడంవల్లనే, అతను తెలుసుకో నవసరంలేదని అతనిశ్రేయస్కాములనబడేవారు భావించడంవల్లనే, హేతువాద రాజకీయాలు కరువైపోయినై. హేతుబద్ధ ఆర్థిక సంబంధాల ఆలోచన కొరవడింది. హేతువాద చోదిత సామాజిక ఆచరణ, స్పృహ లుప్తమైంది.

అందువల్ల మనిషికి తన సర్వతోముఖమైన అస్తిత్వాన్ని గురించిన "స్పృహ" కలిగించే భావవిప్లవం, తాత్కాలిక ఆవేశకావేషాలకు లొంగిపోనీయని భావవికాసం, అన్నిరకాల ఆధిపత్య భావంమీదనూ, అధీనతా భావంమీదనూ తిరుగుబాటు చేయించగల భావోద్రేకమూ మనిషిలో పరవళ్ళు తొక్కాలంటే హేతువాద ఆలోచనారీతిని జీవితరంగాలన్నింటికీ సంఘటించి తీరాలి.

కొందరు రాజకీయ గుత్త వ్యాపారులు రాజకీయాల్లో హేతువాద ప్రసక్తికి భయపడిపోతారు. సర్వరోగ నివారిణి అయిన ఆర్థికమందు తమవద్ద వున్నదనీ, హేతువాదం సాంఘిక సమస్యల్ని తీర్చలేదనీ భేషజాలు వుచ్చరిస్తారు. అది సరికాదు. ప్రథమ కబళంగా దేవుళ్లా-దయ్యాలూ, మతాలూ-కులాలూ పోవలసిందే. అవి పోనిదే స్వతంత్ర మానవుడవతరించడు. స్వతంత్ర మానవుడవతరించడమంటే రాజకీయ భీరువులకు, ఆర్థిక భిషక్కులకు గుండెదడ ప్రారంభంకావడమే.

దేవుడయినా-మత గురువయినా, రాజయినా-ప్రధాని అయినా,

నాయకుడయినా-యజమాని అయినా-అందరూ అధిపులే; అందరూ పెత్తందారులే; అందరికీ తతిమ్మావారు గులాములు కావాలి. ఆ ఆధిపత్య భావం, పెత్తందారీ మనస్తత్వం పోతేతప్ప, మనిషి స్వయం సత్తాకత పాలానుకోజాలదు. అందువల్ల ముందుగా సేవ్య సేవక (Master and Servant) "భావం" కుదుళ్ళతో నశించాలి.

మతమయినా, కులమయినా, జాతిఅయినా, వర్గమయినా, పార్టీ అయినా మనుషులను మనుషుల్లాగా గుర్తించనీయదు. వాటి అవసరాలతో సంఘోద్ధారకు లనబడేవారు "తోడేలు-మేకపిల్ల" కథలుచెపుతూ, మనుషుల మధ్య అడ్డుగోడలూ, అగడ్తలూ నిర్మించి, మనుషుల్ని తాలు-తపకల క్రింద గ్రేడింగు పద్ధతి ప్రారంభిస్తారు. ఈ కార్యక్రమానికంతటికీ యేవేవో "యిజాల" రంగులు పూస్తారు. ఆ స్థితీ, దానివెనుకవున్న మోజూ పోవాలి. అప్పుడే మనిషి మనిషిగా వెలుగులోనికి రావటం సంభవవుతుంది.

**దైవభావం** మనుషుల్లో ఉచ్ఛ - నీచ తారతమ్యాల భావనకు ఓనమాలు యెవరు దిద్దిపెట్టినప్పటికీ, దాన్ని వ్యాకరణ బద్ధంచేసి నిలపెట్టిన ఘనత (అపకీర్తి) దైవభావానికీ, మతానికీ దక్కుతుంది.

మతానికి మూలకందమయిన దేవుడు పుట్టడం భౌతిక భావంగానే పుట్టినప్పటికీ, చివరకు అతీతత్వం సంతరించుకొన్నాడు.

కానీ, ప్రకృతికి బాహ్యంగానూ, అతీతంగానూ, యేమీలేదనే విషయం వాస్తవం. అందువల్ల దేవుడులేడనేదానికి ప్రత్యేకంగా రుజువులు అవసరంలేదు. లేనిదాన్ని లేదనడానికి రుజువులెందుకండీ? అవసరంలేదు-ఐతే, లేనిదాన్ని వున్నదనేవాళ్ళ వాదంలో పసయెంతవుందో మనం తేల్చుకోకతప్పదు.

ఏదయినా వున్నదాన్ని కొందరు గ్రహించలేకపోతే, అది వున్న దని తెలియజెప్పడానికి రుజువులు కావాలి. కానీ అసలు దేవుడనేవాడు లేడుకదా? వున్నాడనే వాళ్ళకుకూడా అసలు దేవుడంటేయేమిటో తెలియదు కదా? లేకుంటే వున్నదాన్ని రుజువుచేయటానికి "ఆస్తికులకు" అంత శ్రమయెందుకండీ ? వేలాది సంవత్సరాలనుంచి రుజువుచేస్తున్నప్పటికీ, యింతవరకు ఆ రుజువుకు రుజువే దొరకలేదు. దేవుడున్నాడో, లేడో, వాళ్ళకుకూడా తెలియదు పాపం! ఐతే దైవభావం "దయ్యమై"పట్టి పీడిస్తున్నందువల్ల, ఈశ్వరవాదులు వృధా వాగ్వివాదానికి దిగుతారు. వాళ్ళందరి దయ్యాలనూ పారగొట్టగల బాధ్యత "హేతువాదభూత వైద్యులే" చేపట్టకతప్పదు.

మతస్థుల్లోకూడా హేతువాదాన్ని అంగీకరించినవారు చాలమంది వున్నారు. కానీ, వారి హేతువాదం కేవలం తర్కం. తర్కం ఆధారంగా దేవుడి అస్తిత్వాన్ని రుజువుచేయడానికి మతస్థులు ప్రయత్నించిన సందర్భాలు మత గ్రంధాల్లో, చాలాచోట్ల కన్పిస్తాయి.

హేతువాదం బైబిలుకూ, క్రైస్తవానికీ విరుద్ధం కాదంటూ (?) బయలుదేరి, దేవుడి అస్తిత్వాన్ని రుజువుచేయడానికి ప్రయత్నించినవారిలో సెయింట్ థామస్ అక్వినాస్ (1225-74) అనే ఇటాలియన్ క్రైస్తవ మతాచార్యుడు ప్రముఖంగావస్తాడు.

అసలు దైవమనే భావమే పురాకృత (a priori) నిర్ణయం. దేవుడున్నాడనే నిర్ణయం ముందుగానే చేసుకొని బయలుదేరడంవల్ల ఈశ్వర వాదుల తర్కం ఆ నిర్ణయానికే దారితీస్తుంది. "సమ్మా థియోలాజికా" (Summa Theologica) పేరుతో ఆస్తికత్వాన్ని సమర్థించడానికి

వ్రాసిన గ్రంధంలో అక్వినాస్ చేసిన పనికూడా అదే.

క్రీస్తుయొక్క ఐదు గాయాల (Stigmata) నుంచి ప్రారంభిం చాదేమోనన్నట్లుగా దేవుడున్నాడనడానికి అక్వినాస్ ఐదు(అ)తార్కిక రుజువులు చూపాడు. ఐతే వాటినన్నిటినీ ఒకే సూత్రంనుంచిరాబట్టాడు. అయన వాదం "అనంత అవ్యవస్థకు" (regresso ad infinitum) సమాధానం చెప్పలేకపోయింది. ఆస్తికులంతా పప్పులో కాలువేసింది అక్కడే.

అక్వినాస్ చూపిన తార్కిక రుజువుల్లో యెంత సత్తావుందో స్థూలంగా పరిశీలిద్దాం :

మొదటి రుజువు :- చలనం (Motion) అనేదివుంది. అనేక వస్తువులు చలనంలో వుండడం మనం చూస్తున్నాం. కదలించేది (Mover) లేనిదే కదలికలేదు. కాబట్టి వస్తువుల్లో నిహితమైవున్న (Potential) కదలికకు వాస్తవికతను (actuality) కలిగించేటటువంటి కదిలే అసలు వస్తువేదోవుంది. నిప్పు కట్టెను కాలుస్తుంది. కాల్చేదీ, కాలేదీ ఒకటికావటానికి వీలులేదు. అలాగే కదిలించేదీ, కదిలేదీ ఒకటి కాదు. కాబట్టి ఆదిచలనశక్తి ఒకటి వుండితీరాలి. ఐతే ఆ ఆదిచలన శక్తిని కదిలించడానికి మరొక చలనశక్తి కావలదా? అని ప్రశ్నించ కూడదు. అలా అనుకోవడంవల్ల ప్రధమ చలనశక్తి లేకుండా పోతుంది. అందుచేత మొదట యెవ్వరిచేతనూ కదలించబడని ప్రధమ చాలకుడు (First Mover) మనకు అవసరం. అదే దేవుడు.

**"Therefore it is necessary to arrive at a first mover moved by no other; and this everyone understands to be God"** అంటారు అక్వినాస్.

లక్వినాస్ మొదటి రుజువులోనే దేవుడనేవాడులేదని తేలిపోయింది. ప్రథమ చలనశక్తివద్ద మనం యెందుకుఆగిపోవాలో ఆయన వివరించలేదు.

ప్రథమ చలనశక్తిని కదిలించడానికి మరొకరు కావలసివస్తే, ఆ సమస్య అంతటితో ముగియదనీ, అది అనంత అనవస్థా దోషానికి దారితీస్తుందనీ ఆయన సమాధానం. ఆ సమాధానం సమాధానమేకాదు. ప్రకృతికి బాహ్యంగా కారణాన్ని వూహించినప్పుడు, ఆ కారణానికి కారణంలేదనే నిర్ణయానికి రావటం అహేతుకం; అతార్కికం. కాబట్టి అక్వినాస్ హేతుక్రమమే తప్పు. బాహ్యకారణంతో నిమిత్తం లేకుండా ప్రకృతి అస్తిత్వానికీ, పరిణామానికీ విజ్ఞానశాస్త్రరీత్యా మనం సమాధానం చెప్పుకోవచ్చుననీ, ప్రకృతి తన అంతర్గత నియమాల ప్రకారం నడుచు కొంటూ పోతున్నదనీ మనం ముందే చూచాం.

17వ శతాబ్దంలో సర్ ఇజాక్ న్యూటన్ (1642-1727) గురుత్వా కర్షణ సూత్రాలను ప్రతిపాదించాడు. వాటి ప్రకారం విశ్వం యావత్తూ యంత్రంలాగా, స్వయంచలితంగా నడుస్తున్నదని ఆనాడే భావించబడింది. ఐతే ఆ సూత్రాలు ప్రతిపాదించినందుకు మతస్థులు హింసిస్తారని న్యూటను భయపడ్డాడు. విశ్వయంత్రాన్ని కదిలించడానికి మొట్టమొదట ఆదిచలన శక్తి (Primum Mobile) ఒకటి వుండివుండాలన్నాడు. అదే deus ex machina - ఆదిశక్తి : జగన్నాటక సూత్రధారి.

ఐతే దేవుణ్ణి ప్రథమ చాలకుడుగా యెందుకు వూహించాలి? అసలు విశ్వంలో చలనంలేనిదేమున్నది? యెక్కడున్నది? యెప్పుడున్నది?

విశ్వం శాశ్వత పరిణతి (Eternal Becoming) లో వున్నది

A C. No. 8104.5

కాబట్టీ, విశ్వంలో సర్వమూ నియతచలనంలో వున్నది కాబట్టీ, అందులో యేదీ, యెన్నడూ విశ్రాంతిలో నిశ్చలంగా లేదుకాబట్టీ, దాన్ని మొదట వేలుపెట్టి కదిలించేవాడు "కావాలి" అనుకోవడం ముందుగా అనుకొన్న దానికి అనుగుణంగా నిర్ణయించుకోవడమే.

అంతకష్టపడి యింత సృష్టినీ చేసినవాడు అలా కదిలించి మాత్రమే వూరుకొన్నాడా? కీయిచ్చి వదలిపెట్టి, గిరగిరతిరిగే బొంగరాన్ని చూస్తూ కూర్చున్న పిల్లవాడిలాగా గుడ్లప్పగించి చూస్తూ వుండిపోయాడా? దేవుడు కదిలించి వూరుకొంటే, విశ్వం కుమ్మరి సారె తిరిగినట్లు తిరుగుతూ వుండిపోయిందనుకోవడం "పిల్లాడి" అమాయక ఆలోచనే. అలా దేవుణ్ణి చచ్చుదద్దమ్మను చేయడానికి యీశ్వర విశ్వాసులకు, ఆస్తిక విద్వాంసులకు మనసెట్లా వొప్పిందో ?

స్వయం సంపూర్ణమైన విశ్వంలో బాహ్యశక్తి ప్రమేయంలేదు. వుండవలసిన అవసరంలేదు. అలాంటి అవసరం వున్నదనుకొన్నప్పుడు ఆ శక్తిని మరొక వూహామాత్రభావానికి అప్పగించడంలో, బందీచేయ డంలో, అర్థంలేదు. అనంత ప్రశ్నను అపేక్షించే ఆదిచలనశక్తి భావం శాస్త్రరీత్యా మాత్రమేకాక, సాధారణ వివేకంరీత్యాకూడా సమర్థనీయంకాదు.

రెండవ రుజువు :- చేతన ప్రపంచంలో నిమిత్త కారణాలు (Efficient causes) అనేవి వున్నాయి. ఒక వస్తువు తనకుతానే నిమిత్త కారణం కాజాలదు. అలా అయినప్పుడు కారణం వస్తువుకంటె ముందుంటుంది. దానికి కారణమేమిటి? ఆ కారణానికి కారణమేమిటి? ఆపైదానికి కారణమేమిటి? అంటూ నిమిత్త కారణాన్ని అనంతంగా

ప్రశ్నించడానికి వీలులేదు. నిమిత్త కారణానికిముందు మధ్యమ (Intermediate) కారణం వుంటుంది. అది అంతిమ (Ultimate) కారణానికి దారితీస్తుంది. కారణాన్ని తీసివేస్తే కార్యంవుండదు. అంతిమ కారణం లేకపోతే అంతిమ ఫలితం (Effect) కూడా వుండదు. అందువల్ల అంతిమ కారణాన్ని మనం అంగీకరించక తప్పదు. దాన్నే దైవం అంటారు.

"Therefore it is necessary to admit a first efficient cause, to which everyone gives the name of God", అంటారు అక్వినాస్.

మొదటి రుజువులోని వస్తువునే భాషమార్చి, రెండవ రుజువుగా చూపాడు అక్వినాస్. ఒక వస్తువు తనకుతానే నిమిత్తం కాజాలదంటాడు అక్వినాస్. బాగానేవుంది. మరి దేవుడు తనకుతాను నిమిత్తకారణం కాగలడా? ఎలా? - సమాధానంలేదు.

అసలు ఒక వస్తువు ఒక దశనుంచి మరొక దశలోకి మారే క్రమంలో దానిలోవచ్చే అంతర్గత పరిణామక్రమాన్నే కార్యకారణక్రమం అంటాం. ఒక కారణం కార్యానికీ, ఆ కార్యం మరొక కారణానికీ, ఆ కారణం యింకొక కార్యానికీ దారితీస్తుంటాయి. అందువల్ల కార్య కారణాలు రెండూ వేరుచేయడానికి వీలులేకుండా విలీనమైపోతాయి. కార్యం కారణంగానూ, కారణం కార్యంగానూ మారిపోతాయి.

నీరు వర్షానికి కారణం. వర్షం నీటికి కారణం. మరల నీరు వర్షానికి కారణం. తిరిగి వర్షం నీటికి కారణం...ఇలా కార్య కారణక్రమం

నీరు—> వర్షం—> నీరు—> వర్షం—> నీరు అంటూ గుడుగుడు గుంచం ఆడుకొంటుంది. కార్యాన్ని వెనక్కు (reverse) మలిపితే కారణమవుతుంది.

నీరు <— —> వర్షం

ఇప్పుడు చెప్పండి! దేవుడు విశ్వానికి కారణమా? విశ్వం దేవుడికి కారణమా ?

పై కార్యకారణ క్రమంలో నిమిత్త కారణాన్ని యెక్కడ పెడతాం? అంతిమ ఫలితమంటే యేమిటి? అది యెక్కడవుంది? నిరంతర నిరంతరాయ పరిణామగతిలో వున్న యీ విశ్వంలో అంతిమ కారణాన్నీ, అంతిమఫలితాన్నీ తేల్చుకోవడంయెలా ?

ఈ ప్రపంచంవుంది—దీన్ని అంతిమఫలితమని అంగీకరించామనుకోండి – దీనికి కారణమేమిటి అని ప్రశ్నించుకొన్నప్పుడు పురాకృత నిర్ణయం ప్రకారం దేవుణ్ణి అంతిమకారణంగా కూర్చోపెట్టవలసి వచ్చిందనుకోండి —

పైన మనం చూచినదాన్నిబట్టి కార్యకారణ క్రమం – కారణకార్యక్రమంగాకూడా మారుతుంది. కాబట్టి, దేవుణ్ణి అంతిమకార్యంగా తీసుకొంటే, దాని అంతిమ కారణమేమిటో మనం చెప్పగలగాలి – ఇది తిరిగి అనవస్థాదోషానికే గురిఅవుతుంది.

ఎందుకంటే, దేవుడు అనేది మొద్దు అంకెకాదు. దానితో నిమిత్త కారణం ఆగవలసిన అవసరమేమిటో మనకు తెలియాలి. ఎవరు చెప్పాలి? అంతిమ కారణాన్ని యెరిగినవారు చెప్పాలి. అంతేకదామరి?

సర్వజ్ఞులైన మతస్థులు అక్కడకు వచ్చేసరికి "ఆది అంతే-ఆది అంతే-ఆది అంతే" అంటూ పగిలిపోయిన గ్రామఫోను రికార్డు అవతారం తాలుస్తారు.

విశ్వమంతా అంతర్గత కారణాలవల్ల పరిణామం చెందుతూవుందనీ, నిత్యనూతన విశ్వంగా మారిపోతూవుందనీ, అందువల్ల సృష్టిభావం అంతరించి పోతూవుందనీ, ఆధునిక విజ్ఞానం స్పష్టంచేస్తున్నది. కానీ, యీశ్వర వాదులు దేవుణ్ణి ఏ పరిణామమూ యెరగని - యెదుగూబొదుగూలేని మొద్దబ్బాయిని చేసివేశారు.

ఐతే యే పరిణామమూలేని యీ మొద్దబ్బాయిలోని చైతన్యాన్ని వూహించడమెలా? అతని మేధాసంపత్తిని గుణించడమెలా ?

సృష్టిచేయకముందు ఆ దేవుడేమి చేస్తున్నాడు? అని సెయింట్ అగస్టిన్ ప్రశ్నించాడు. ఆ ప్రశ్నకు యేనాడూ సమాధానంలేదు. కానీ, సృష్టించిన తర్వాత యిప్పటిదాక ఆ దేవుడేమి చేస్తున్నాడు? - అని మనం మరొక ప్రశ్నవేద్దాం. ఏమయినా చేస్తున్నట్లు యెవరివద్దకూడా యేవిధమైన దాఖలాలేదుకదా ?

అనంతమయిన దైవం సాంతమయిన ప్రపంచానికి కారణమయితే, అనంత కారణానికి - సాంతఫలితానికి పొత్తెలా కుదురుతుంది? దైవాన్ని గురించిన పరిపూర్ణజ్ఞానం యెలా లభిస్తుంది? అనే అభ్యంతరాలకు సమాధానం చెప్తూ దేవుణ్ణి పరిపూర్ణంగా మనం తెలుసుకోలేమంటారు అక్వినాస్.

"From effects not proportioned to the cause, no

perfect knowledge of that cause can be obtained .. from them (effects). We cannot know God perfectly as is in his essence''.

దేవుణ్ణి గురించి పరిపూర్ణంగా తెలుసుకోలేమన్న అంశాన్ని అటుంచుదాం. అసలు మనిషి దేన్నిగురించి అయినా "పరిపూర్ణ" జ్ఞానం సంపాదించడం యెలా సాధ్యం? ఉన్నదాన్ని గురించిన పరిపూర్ణజ్ఞానమే సాధ్యంకానప్పుడు, లేనిదాన్ని (దైవాన్ని) గురించిన జ్ఞానం పొందడమనే సమస్యయెలా వుత్పన్నమవుతుంది? అందువల్ల మానవుడు తన అజ్ఞానంలో నుంచే అనంతుడనే దైవాన్ని సృజించుకొన్నాడని తెలుతుంది. అలాంటి నాస్తిని గురించిన జ్ఞానం సంపూర్ణమయినా, అసంపూర్ణమయినా అది అజ్ఞానమే. అజ్ఞానంగా అది సంపూర్ణమే.

మూడవ రుజువు :- ప్రకృతిలో వస్తువులుండడం, ఉండక పోవడం-రెండూ సంభవమేనని మనం చూస్తున్నాం. వస్తువులు పుడుతున్నాయి, చస్తున్నాయి. ఇవి శాశ్వతంకావు. ఏదీ శాశ్వతం కాకపోతే ఒకప్పుడు యేమీలేదన్న విషయం నిజమేకదా? అంటే ఒకప్పుడు శూన్యం (Nothing) వున్నవిషయం నిజమైతే, యిప్పుడుకూడా యేమీవుండదు కదా? ఎందుకంటే లేనిది యెప్పుడయినా వున్నదానిలోనుంచే వునికిని ప్రారంభించాలికదా? ఒకప్పుడు యేమీలేకపోతే, యిప్పుడుకూడా యేమీ వుండదు. అసలే లేనిదానినుంచి యేమీరావడం సంభవంకాదు. అందువల్ల ఆవశ్యకమైన వస్తువేదో వుండితీరాలి-అన్నీ వుండడం సంభవంకాదు. ఆ ఆవశ్యకతకు మరొక ఆవశ్యకతను (Necessity) కారణంగా చెప్పుకోలేము ఎందుకంటే, అప్పుడు తిరిగి అనంతప్రశ్నలోకి పోతాం. అందువల్ల స్వయం ఆవశ్యకత కలదేదో ఒకటివుండి, యితర ఆవశ్యకతలకు కారణమవుతుంది. దాన్నే దేవుడంటాం :

"Therefore we cannot but admit the existence of some being having of itself its own necessity, and not receiving it from another, but rather causing in others their necessity. This all men speak of as God" అంటాడు అక్వినాస్.

కాబట్టి, "ఆదియందు శూన్యముండెను" అన్న బైబిలు ప్రారంభ వాక్యం అక్వినాస్ ప్రకారం అబద్ధమన్న మాట. పుట్టేవాళ్ళంతా చస్తున్నారంటే, చచ్చేవాళ్ళంతా నాశనమై, శూన్యమైపోతున్నారని అక్వినాస్ వుద్దేశం.

కానీ, "ప్రకృతిలో యేదీ నాశనం కావడంలేదు" అని ఆధునిక విజ్ఞానంలోని శక్తి నిత్యత్వ సూత్రం (Law of Conservation of Energy) రుజువుచేస్తున్నది. అయితే అక్వినాస్ అంతదూరంవరకుకూడా దృష్టి సారించలేదు. "జీవులన్నీ పుడుతున్నాయి–అంటే వున్న దేవుడిలో నుంచి పుడుతున్నాయి. జీవులన్నీ మరణిస్తున్నాయి–అంటే నాశనమై, నిష్ప్రయోజనమైపోతున్నాయి. అంటే ప్రపంచంలో ఒక్క దేవుడేతప్ప యేదీ శాశ్వతంకాదు. మానవజీవితం బుద్బుదప్రాయం" అని రుజువు చేయడమే అక్వినాస్ పరమావధి.

అయితే వున్నది మరొకదాని (?)లో నుంచే రావాలి కాబట్టి, ఆ వున్నదీ, యీ ప్రపంచానికి కారణమైనదీ, శాశ్వత అస్తిత్వం కలదీ దైవమనీ–దాని వునికికి మరొకదాని వునికి కారణం కావలసిన అవసరం లేదనీ–అక్వినాస్ వాదించడంలో మొదటి రెండు రుజువుల్లో యెదురువచ్చిన అనవస్థాదోషాన్ని దాటలేకపోయాడు. అక్కడకు వచ్చేటప్పటికి కప్పగంతు వేస్తూనే వున్నాడు.

కానీ, జీవుల క్రమపరిణామంలోనే జననమరణాలు సంభవిస్తున్నాయి. జననంవల్ల లేనిదిరావడం, మరణంవల్ల వున్నది నశించడం జరగడం లేదు. జనన మరణాలు రెండు విభిన్న దశలు. లేనిదేదీ క్రొత్తగా రావడంలేదు. వున్నదేదీ లేకుండా (నశించి) పోవడంలేదు. అంతా నియత పరిణామంలోవుంది. ఇందులో యేదీ దేవుడి అస్తిత్వంనుంచి వుబికివచ్చేదిలేదు. నీరు వేడివల్ల ఆవిరికావడమంటే, నీరు నాశనం కావడంకాదు. ఆవిరి చల్లబడి నీరు రావడమంటే, లేనిది పుట్టడంకాదు.

అలా మాటలగారడీ చేయడమే హేతువాదమని అక్వినాస్ విశ్వసించి నట్లుంది.

నాలుగవ రుజువు :- వస్తువుల్లో గుణాలున్నాయి-సౌజన్యం, సత్యం, ఘనత వగైరాలు. వాటిలో తారతమ్యాలున్నాయి. సౌజన్యం, సత్యం, ఘనత అత్యంత గరిష్టస్థాయిలో కలిగివున్న వ్యక్తి అస్తిత్వం కూడా గరిష్టమే. అందువల్ల అందరి అస్తిత్వానికీ, సౌజన్యానికీ, యితర గుణాల పరిపూర్ణతలకూ ఆకరమైనదేదైతే వున్నదో, దాన్నే దేవుడంటాం.

"Therefore there must also be something which is to all beings the cause of their being, goodness and every other perfection; and this we call God", అంటాడు అక్వినాస్.

ఇందులో అక్వినాస్ దేవుడినైతికతత్వంలోకీ, పరిపూర్ణత్వంలోకీ దిగాడు.

ఏది నీతి? ఏది అవినీతి? అనే చర్చలోకి దిగితే, మనం మతస్థులతో కలిసే కూడలి యెంతదూరంలో వుంటుందో, యేమో? అందువల్ల యేది

మంచి? యెవరికిమంచి? మొదలయిన విషయాల ప్రసక్తివదలి, దేవుడెంత మంచివాడో, ఏయే మంచిపనులు, యెంత మంచిపనులు చేశాడో కొంచెం చూద్దాం.

దయాదాక్షిణ్యమూర్తీ, సర్వోత్తముడూ అయిన సర్వేశ్వరుడే కదా యీసృష్టి అంతా చేశాడని అక్వినాస్ అంటున్నారు? ఐతే ఆయన సృష్టిలో వుత్తమమయినదేదీ ?

ప్రకృతి వైపరీత్యాలన్నీ దేవుడు సృష్టించినవేనా? తుఫానులు, వుప్పెనలు, వరదలు, భూకంపాలు దేవుడు సృష్టించినవేనా? అతివృష్టి, అనావృష్టి, కరువులు, కాటకాలు, దేవుడు సృష్టించినవేనా? కలరా, ప్లేగు, స్ఫోటకం, క్షయ వ్యాధుల క్రిముల్ని దేవుడే సృజించాడా? సింహాలు, పులులు, తోడేళ్లు, తేళ్లు, పాములు దేవుడు సృష్టించినవేనా? దోపిడిని, పేదరికాన్ని, అజ్ఞానాన్ని, అంగవైకల్యాన్ని దెవుడే సృజిస్తున్నాడా? యుద్ధోన్మాదుల్నీ, నియంతల్నీ, క్రూరుల్నీ, వంచకుల్నీ, మానవతా విరోధుల్నీ దేవుడే సృజించాడా? పవిత్ర మతయుద్ధాలూ, 30 సంవత్సరాల యుద్ధాలూ, 100 సంవత్సరాల యుద్ధాలూ ప్రోత్సహించినవాడు దేవుడేనా? భిన్న మతాలను సృష్టించింది దేవుడేనా? మతకక్షలు రేపి, హత్యలను పురికొల్పింది దేవుడేనా? ధర్మరక్షణ పేరుతో శాస్త్రజ్ఞానాన్నీ, సత్యాన్నీ రూపుమాపడానికి వ్యూహంపన్ని శాస్త్రజ్ఞులమీద అమానుష హింసాకాండ, సజీవ దహనకాండ జరిపింది దేవుడేనా?

ఇందులో యేది దేవుడి ఘనకార్యం? ఎందులో దేవుడి సౌజన్యం, సౌశీల్యం వున్నాయి? ఇలాంటి చర్యలన్నీ మనుషులుచేస్తే, మతం యే రకమయిన ముద్రలు వేస్తుంది? ఏది నీతి? ఏది అవినీతి? దేవుడి సర్వోత్తమ స్వభావానికి గీటురాయియేది ?

చరిత్రను తిరగవేయండి! దేవుడి పేరుతో యింతవరకు జరిగిన దానిలో మంచికంటె చెడు చాలారెట్లుంది. మతగ్రంథాలన్నీ అవిశ్వాసుల మీద కాలకూటవిషం వెళ్ళగక్కాయి. అన్నిరకాల మతస్థులూ అన్య జనుల్ని చిత్రాతి చిత్రహింసలకు గురిచేశారు. ఇదంతా ధర్మరక్షణ పేరుతో మత అజమాయిషీక్రింద జరిగిందే.

దేవుణ్ణి పరిపూర్ణుడంటున్నారు ఎందులో పరిపూర్ణుడు? అసలు పరిపూర్ణత అంటే యేమిటి? అది యెక్కడ వుంది? దేవుడు పరిపూర్ణు డయితే, అతనికి యీ సృష్టి చేయవలసిన "కర్మ" యెందుకు పట్టింది? అతనికి పరిపూర్ణత్వం యెప్పుడు సిద్ధించింది? సృష్టికి పూర్వమా? అనంతరమా? ప్రపంచంలో యెంతో పాపంవుందని అన్నిమతాలూ చెపుతాయి—కానీ ఆదం ఒక్కపంటుకోసుకొని తిన్నందుకు దేవుడింతపాపం యెందుకు పండించాడు? దయాదాక్షిణ్యమూర్తి అయిన దేవుడు దుష్టులను యెందుకు సృష్టించాడు?

అసలు కథ అదికాదు — తనకులేని గొప్పతనాలన్నీ దేవుడికి అప్పగించే తొందరపాటులో మనిషి విచక్షణాజ్ఞానాన్ని కోల్పోయాడు. అందువల్ల దేవుడు పాపిష్టివాడుగా (?) మారిపోకతప్పలేదు.

ఐదివరుజువు :— ఇదే అక్వినాస్ చూపిన చిట్టచివరి రుజువు. ప్రపంచ వ్యవహారమంతా ఒక పద్ధతిప్రకారం జరుగుతూవుంది. ప్రకృతి లోని వస్తువులన్నీ ఒక లక్ష్యాన్నిబట్టి నడుస్తున్నాయి. విలుకాడు బాణాన్ని లక్ష్యంవైపు విడుస్తున్నట్లుగా, మేధానిధి ఒకడు ప్రతిదాన్నీ ఒక లక్ష్యాన్ని వుద్దేశించి నడుపుతున్నాడు. అలా అన్నింటినీ ప్రణాళికాబద్ధంగా నడిపే మేధానిధినే మనం దేవుడంటాం.

"Therefore some intelligent being exists by whom all natural things are directed 'to their end, and this being we call God" అంటాడు చివరగా అక్వినాస్.

ఇది నికాళసయిన మానుష వికార భావనకు పరాకాష్ఠ.

దేవుడు మనిషిని సృష్టించాడనీ, అతనికోసం మిగతా యావత్ ప్రపంచాన్నీ సృష్టించాడనీ, అన్ని మతాలూ నమ్ముతాయి. మనిషిని గురించికానీ, ప్రకృతిని గురించికానీ, సమగ్ర అవగాహన లేనిరోజుల్లోవివే యీ ఆలోచనలు. కానీ, ఆ ఆలోచనలు నిజాలుకావని యీనాటి శాస్త్ర జ్ఞానం వేనేళ్ళ చాటుతున్నది.

ప్రకృతిలో దేనికీ బాహ్యచోదకశక్తి లేదు. కాబట్టి నియమబద్ధమైన యీ ప్రకృతిని ఒక తెలివికల వ్యక్తి సృష్టించి నడుపుతున్నాడనే దానిలో అర్థంలేదు.

వర్తమానంనుంచి గతాన్ని వూహించడంలో హేతువాదానికీ, భౌతికతత్వానికీ విడాకులివ్వడంద్వారా జనించిన దేవుడు శాస్త్రానికీ, తర్కానికి అందకుండా పోయాడు. అందువల్లనే దేవుణ్ణిగురించి మత బోధకులు యెవరికలలు వారుకన్నారు. ఇలా ఎవరిభావాలకు అనుగుణంగా వాళ్ళు సృష్టించుకొన్న దేవుడు పురాకృతభావమే (apriori eategory). సిద్ధభావమే.

దాని సమర్ధనకోసం చేసే వాదం స్వేచ్ఛాయుతంకాదు. పాతభావాల బందిఖానా నుంచి మాత్రమే ఆ పెనుగులాట ప్రారంభమవుతుంది-అందుకే,

"If God does not exist it would of course be impossible to prove it; and if he does exist it would be

folly to attempt it. For at the very outset, in begining my proof, I will have presupposed it, not as doubtflu but as certain". (A presupposition is never doubtful' for the very reason that it is a presupposition.)

అంటాడు సోరెన్‌కిర్కె గార్డ్ అనే డేనిష్ మతతాత్వికుడు (1813–55).

– అంటే దేవుడు లేకపోతే రుజువు చేయడం అసంభవం. వుంటే రుజువు చేయడానికి ప్రయత్నించడం అవివేకం. ఎందుకంటే, రుజువుకు దిగేముందుగానే దేవుడున్నాడనుకొని దిగడమవుతుంది–అలాంటి పురాకృత నిర్ణయాలు సత్యాన్వేషణను చంపివేస్తాయి.

ప్రకృతిలో ప్రకటితమవుతున్న నియమబద్ధతనుంచి మనమొక మేధావంతుణ్ణి సృజించుకోనవసరంలేదు. ఆ నియమబద్ధతే ప్రకృతి స్వయంసమృద్ధతకూ, ఈశ్వరవాద నిరాకరణకూ తార్కాణం.

అందువల్లనే మనిషి తన కోణంనుంచి, తన ఆకార వికారాలతో దేవుణ్ణి సృజించుకొంటే–అదియే చీమలో, దోమలో లేక పందులో, కుక్కలో అయితే, వాటికోణంనుంచే, వాటి ఆకార వికారాలతోనే దేవుణ్ణి సృజించుకొని వుండేవి. ప్రకృతి క్రమానికి మన మేధస్సును సంధించి, మరొక అనంత మేధానిధిని మనం సృష్టిస్తున్నామేకాని, ఆ మేధానిధి నిత్యకృత్యాలు మనకు అనూహ్యంగానే వుండిపోతున్నాయి.

అందువల్ల మనిషి యెంతవరకు పరిపూర్ణుడో, దేవుడుకూడా అంత వరకే పరిపూర్ణుడు. దేవుడు మనిషి మనస్సుకు పుట్టిన బిడ్డకాబట్టి, అతని వూహకుమించిన అస్తిత్వం, వ్యక్తిత్వం దేవుడికి అబ్బవు. అందుకే అక్వినాస్ తెలివిగా **We cannot know God perfectly** అన్నాడు.

తన ఆకారంలో దేవుణ్ణి సృష్టించుకొన్న ఆదిమానవుడు అతణ్ణి "చాలపెద్ద" మనిషిని చేశాడు. తనకులేని శక్తియుక్తులన్నీ యిచ్చాడు. అమేయ మేధాసంపత్తిని యిచ్చాడు. వాక్శుద్ధిని, సిద్ధినీయిచ్చి మహామహిమాన్వితుణ్ణి చేశాడు. కామరూపధారిని చేశాడు. సంకల్ప సిద్ధుణ్ణి చేశాడు. అతనికి సృష్టి-స్థితి-లయ కర్తృత్వం యిచ్చాడు. ఒక్కమాటలో చెప్పాలంటే, మనిషికి లేనివీ, సాధ్యంకావనుకొన్నవీ – అన్నీ కట్టబెట్టాడు. మతగ్రంధాల్లోవున్న దేవుళ్ళను పలకరిస్తే, ఆ విషయాలు మనకు యేకరువు పెడతారు. మతగ్రంథాలన్నీ దేవుళ్ళ ఆవాసంకోసం పై లోకాలను సృష్టించాయి. కొన్ని గ్రంధాలు పెళ్ళాలనూ, పిల్లలనుకూడా దానంచేశాయి. కొల్లగొట్టిన శత్రుసంపద లోను, దోపిళ్ళలోదొరికిన స్త్రీ-జీవిస-మానవ సంపదలోను భాగాలూ పెట్టాయి. అంటే దేవుడిశక్తుల్ని, అవసరాల్ని, మనుషుల శక్తులకూ, అవసరాలకూమించి ఆదిమానవుడు పెంచాదేకానీ, దైవభావానికి మూలం మానుషరూపం మానుషభావన తప్ప మరొకటికాదు అని తేలిపోయింది. ఆ విధంగా ఆదిమానవుడి హేతువాదం అంతవరకు సక్రమమైనదే ననిపిస్తుంది. ఎందుకంటే అతని జ్ఞాన సాధనావకాశాలు పరిమితమైనవి. ఆపరిమితిలో అతని హేతుత్వమూ, దానిద్వారా సాగిన వూహాపోహలూ అంతకుమించి చొచ్చుకుపోవడానికి వీలులేదేమో!

విజ్ఞానం క్రమానుగతంగా పెరుగుతూనే వస్తున్నది. అయినా మనిషి మానుషభావ దైవశృంఖలాలను త్రెంచుకోలేక పోయాడంటే, అతని హేతుత్వం సక్రమంగా పనిచేయడంలేదనే అర్థం. పైగా అది యేదోవిధంగా దైవభావాన్ని సమర్థించుకోడానికే వినియోగించబడుతూ వచ్చింది. ఫలితంగా దేవుడికి సర్వాంతర్యామిత్వం, సర్వమయత్వం ప్రసాదించి, అతణ్ణి క్రమంగా విశ్వంతో సమానార్థకంగా పరిగణించడం జరిగింది.

అంటే, దైవం విశ్వానికి మరొక పేరుగా పరిణమించింది-అంటే విశ్వాన్ని దైవమనీ, దైవాన్ని విశ్వమనీ పిలుచుకోవచ్చు నన్నమాట. "విశ్వమంతా మనకు తెలియదుకాబట్టి, మనకు తెలియని విశ్వంలో దైవమున్నాదేమో, మనమెందుకు కాదనాలి?" అంటూ మానవుడి అపరిపూర్ణ జ్ఞాన పరిధిలోకి-అంటే అజ్ఞాన పరిధిలోకి దైవాన్ని నెట్టివేయడం జరుగుతున్నది. చివరకు అస్తిత్వరహితమయిన ఆదిమధ్యాంత రహితత్వంగా, నిరుక్తబ్రహ్మంగా ఆ భావాన్ని ఊహాతీత లోకంలో ప్రతిష్ఠించడం జరుగుతున్నది. పర్యవసానంగా ఆధునిక విజ్ఞాని భావంకూడా ఆటవిక విజ్ఞాని యొక్క అసంబద్ధ ఊహాలను అంటిపెట్టుకొని బ్రతుకవలసిన పరిస్థితి యేర్పడింది.

సమాధానం గట్టుగాతోచిన ప్రతిచోటా దేవుడి అవతారం మార్చడానికి "ఆధునికులు" చేసే ప్రయత్నాలు వైజ్ఞానికంగా క్షమార్హాలుకావు. ప్రాచీనుల దైవం ప్రాకృతభావం. సూర్యుణ్ణీ-చంద్రుణ్ణీ, నీటినీ-నిప్పునీ, గాలినీ-ధూళినీ, కొండల్నీ-బండల్నీ, చెట్లనీ-పుట్టల్నీ, వాగుల్నీ-వంతల్నీ రోగాల్నీ-రొష్టుల్నీ-సర్వవస్తుమయ ప్రకృతిని పూజించడమనేది నాగరిక పూర్వదశలో మానవుడి వివిధ ఆవాసాల్లోనూవుంది. అన్నిమతాలూ ఆ దశను చిత్రించినై. ఇన్ని వేల సంవత్సరాల తర్వాత మరల యీనాడు విశ్వాత్మ-విశ్వసంకల్పం-పరమాత్మ-పరంజ్యోతి వంటి పేర్లతో ప్రాచీన ప్రాకృత వాదాన్నే ఇంద్రజాలిక భాషలో పొదగడం హేతుతత్వరీత్యా అసమంజసం.

కానీ, యావదస్తిత్వానికీ సర్వాధికారిగా భావించబడే దైవంయొక్క అస్తిత్వాన్ని నిరాకరించగల్గడం అంతతేలిక విషయంకాదు. జ్ఞాన సర్వస్వంగా భావించబడే మతవ్యవస్థయొక్క అధికారాన్ని తిరస్కరించ

గల్గడంకూడా అంత సులువయిన వ్యవహారంకాదు. అందువల్ల అనాదిగా పాషండులూ (Heretics), విగ్రహ విధ్వంసకులూ (Iconoclasts), నిరీశ్వరవాదులూ (Atheists), చేస్తూవచ్చిన కృషి స్వల్పమయినదికాదు. వారిది నిష్కామజ్ఞానదీక్షేకాని, అర్థాభిలాష, అధికార జిగీషకావు. దాని కెంతో మనోస్థైర్యమూ, ధైర్యమూ, త్యాగనిరతీ, కార్యదీక్ష కావాలి.

ప్రాచీన గ్రీసులోని యెపిక్యూరియనులు - ముఖ్యంగా ప్రాచీన భారత్‌లోని చార్వాకులు నిర్వహించిన తాత్విక పోరాటం నల్లేరుమీది బండినడకకాదు. రెండువేల సంవత్సరాలక్రితం త్రొక్కివేయబడ్డ స్వాభావికవాదం, భౌతికతత్వ జిజ్ఞాస తిరిగి యెప్పుడు తలెత్తిందో, యెలాతలెత్తిందో, దాని పునర్వికాస కర్తలెవ్వరో మనకు సరిగా తెలియ రావడంలేదు. ఐనప్పటికీ. మతవాదుల ఖండనల్లో పెల్లుబికిన చార్వాకాన్ని బట్టి, దాన్నిపూర్తిగా నిర్మూలించడం మతవాదులకు సాధ్యం కాలేదని విస్తుంది. దాని అవశేషాలనుంచే ఆధునిక భౌతికవాద చింతన బయలు దేరి బలం పుంజుకొంది.

నాలుగువందల సంవత్సరాల క్రిందట యూరపులో పునర్వికాస యుగం ప్రారంభమైంది. శాస్త్రజ్ఞానం పైదోడుగా పెరిగిన ఫలితంగా భౌతికవాదం కొత్త తాత్వికశక్తిగా రూపొందింది. ప్రాచీన స్వభావవాదుల బలిపీఠంమీదనుంచి ప్రాపిరిపిల్చుకొని పునర్జీవించింది. భావపోరాటం పునరావృతమైంది.

చరిత్రలో యెన్నో భావోద్యమాలు బలాత్కారంగా అణచివేయ బడినై. ధ్వంసమైపోయిన మతాలు పునరుజ్జీవనం పొందడానికి సాధ్యం కాలేదు. కారణం అవి మతాలుకావడమే; వాటి (శూన్య) స్థానాన్ని

యేదో ఒక మత ఆలోచనా విధానం నింపడమే. మతాల శాఖలన్నీ పాత మతంమీద సంస్కరణ స్థూప నిర్మాణాలే.

మతం యెంత క్రూరంగా అణచివేసినా స్వభావవాదం పునరావృతం కావడం అసాధ్యంకాలేదు. శంకాత్మకమైన హేతుత్వం పనిచేస్తున్నంత కాలం స్వభావవాదాన్ని నిర్మూలించడం సాధ్యంకాదు. జడస్వభావంకల మతాలు దాన్ని యెంతగా అణగద్రొక్కినప్పటికీ అది చిగురిస్తూనేవుంది. అందుకే సర్వదర్శన సంగ్రహ రచయిత మాధవాచార్యులుసైతం "దురుచ్ఛేదంహి చార్వాకస్య చేష్టితమ్" అంటూ చార్వాకాన్ని నిర్మూలించడం అసాధ్యమని పేర్కొన్నాడు. మతతత్వానికి పూర్తిగా భిన్నమయిన సారం కలది స్వభావవాదమనబడే భౌతికవాదమే. మతాలూ, వాటిశాఖలూ ఒకదానికంటె మరొకటి లౌకికాలౌకికజీవితాలకు దగ్గరగానో, దూరంగానో జరుగుతూ రావడానికి ప్రయత్నించడంవల్ల మాత్రమే అవి పరస్పరంభిన్నంగా వున్నట్లు కన్పిస్తాయికాని, మతసారమంతాఐక్యమే. ముందటి ఆచరణతో యిమడలేక పరిణామం చెందినప్పటికీ, అదిమ ప్రాతిపదికలను వదలుకోజాలకపోవడంవల్ల మతం మతంగానే నిలబడిపోతుంది. దానిలో వచ్చే మార్పు వస్తుతః మార్పుకాదు. స్వభావవాదం అలాకాదు అది నిత్యనూతనమయిన విజ్ఞానాన్ని యిముడ్చుకొంటుంది. పాత ప్రాతిపదికలను త్రోసివేసుకోగలుగుతుంది. కొత్త ప్రాతిపదికలతో సాగిపోగలుగుతుంది. భౌతిక వాస్తవికతవైపుకు పురోగమించగలుగుతుంది.

## మతం

ప్రతి మతమూ తాను ప్రతిపాదించిన సిద్ధాంతాలను నమ్మనివారికి పాషండులని ముద్రవేస్తుంది. ప్రతి మత గ్రంథమూ అవిశ్వాసులకు

రౌరవాది నరకలోకాలూ, అనంత దుఃఖాలూ, దుస్సహమయిన కష్టాలూ, దుర్నివార్యమయిన బెంగుళ్లూ వ్రాసిపెట్టింది. ఏ మతమూ పరమతాన్ని, మతశాఖని, భిన్నభావాలను సహించలేదు. ఇది చరిత్ర యెలుగెత్తిచాటే వాస్తవం. అందువల్ల అన్నిమతాలనూ హేతువాదం నిరాకరిస్తుంది.

మతాన్ని నిరాకరించడమంటే మానవ విలువల వారసత్వాన్ని నిరాకరించడంకాదు. మతం యెక్కడయినా మంచిని స్వీకరించివుంటే, అది మతం సొత్తుకాదు. అది మానవవాద వారసత్వం.

మతాన్ని మనం అంగీకరించినంతమాత్రాన మతస్థులు ఔనన్న వాటినన్నిటినీ కాదనీ, వారు కాదన్నవాటి నన్నిటినీ ఔననీ అనడం సహేతుకమూకాదు; శాస్త్రీయమూకాదు. అది వైతండిక మవుతుందేకాని, నాస్తికత్వంకూడా కాదు. ఎందుకంటే నాస్తికత్వమంటే వైతండికం కాదు; రెట్టమతంకాదు. హేతువాదం ఆ వైఖరిని ఆమోదించదు.

ఒక మతం మరొక మతాన్ని ద్వేషిస్తుంది. మరొక మతంపట్ల అసహనంతో ప్రవర్తిస్తుంది. హేతువాదం మతాలన్నిటినీ సమానంగా నిరాకరిస్తుంది. ఏ మతాన్నీ అంగీకరించదు. ఏ మతంపట్లకానీ, భావంపట్లకానీ, హేతువాదం అసహనాన్నీ. ద్వేషాన్నీ ప్రదర్శించదు. అసహన, ద్వేషాలవల్ల మత విశ్వాసాలు మారవని హేతువాదులకు తెలుసు. మత మౌఢ్యం మారాలంటే మానసిక పరివర్తన రావాలనీ, అది చాల నిదానమయిన క్రమమనీ హేతువాదులకు తెలుసు. మహాత్మ్యాలు అబద్ధమని నిర్ధారించుకొన్న హేతువాదులకు మత విశ్వాసం హఠాత్తుగా తెల్లవారేటప్పటికి మారదని తెలుసు. ఆంక్షలవల్ల, నిర్బంధాలవల్ల, నిరంకుశ నిషేధాలవల్ల మతతత్వం అణగిపోదని హేతువాదులకు తెలుసు.

అందువల్ల మనుషుల్లో ఆవేశాలు, ఉద్వేగాలు, ఉద్రేకాలు రెచ్చగొట్టడంద్వారా మతవిశ్వాసాలు మారవనీ, మనుషుల్లోవున్న వివేచనా జ్ఞానాన్ని పనిచేయించడంద్వారా మాత్రమే ఏవిధమయిన మౌఢ్యాన్నయినా రూపుమాపవచ్చుననీ హేతువాదుల నిశ్చితాభిప్రాయం.

మతాలూ, వ్యవస్థీకృత సిద్ధాంతాలూ మనిషిని ఆలోచించనీయవు. వారు పుట్టకముందే వారికోసం అంతా ఆలోచించి పెట్టబడివుంటుంది. వారు "ఆలోచించవలసిన" మార్గమంతా గ్రంధీకరించబడివుంటుంది. దాన్నికాదనే అధికారంకానీ, సవరించే అధికారంకానీ వారికుండదు. ఆ భావ నియంతృత్వ ఫలితం మానసిక దాస్యం.

భావ నియంతృత్వం సాంఘికపరిణామాన్ని అనుమతించదు. ఐనా, పరిణామం నిదానంగానయినా సాగుతుందికాని, ఆగదు.

స్వేచ్ఛాజిజ్ఞాస, హేతుత్వం మానవుడి ప్రాథమిక మానసిక స్వత్వాలు. మనిషి మనిషిగావుండి ఆలోచించకుండా వుండలేడు; ఫలితంగా జ్ఞానం లభించకుండా, వృద్ధికాకుండా వుండదు. ఆ జ్ఞానం సంఘపరిణామానికి ఎడతెగని ప్రోత్సాహం యివ్వకుండా వుండదు. అందువల్ల మార్పును అపేక్షించే జ్ఞానాన్ని మార్పునువ్యతిరేకించే మతం (జ్ఞానపూర్వదశ) నిరోధిస్తుంది. అనివార్యమయిన ఘర్షణస్వరూపం ఏమయినప్పటికీ, సామాజిక న్యాయమూ, సామాజిక వ్యవస్థలూ మార్పుకోసం ప్రసవవేదనపడతాయి. మతం ప్రతిపాదించే నీతులు ద్వేషపూరితమయిన పాశవిక సాంప్రదాయాలను నిలబెట్టడానికి పూనుకొంటాయి. అందువల్ల జాతి, మత, కుల, వర్గ ప్రాతిపదికలమీద మనం ఆచారం పెడితే-విజ్ఞానం, తత్వం, స్వేచ్ఛ, సమత, న్యాయం, సౌభ్రాతృత్వం, మానవత

ప్రాతిపదికలుగా నిర్ణయించబడవలసిన మానవవాద నీతి దుర్లభమవుతుంది. మానవులంతా ఒకటే అనుకొన్నపుడు (కట్టు-బొట్టు, ఆహార-విహారాలు, ఆచార-సాంప్రదాయాలు, ఆకార-వర్ణాలు, వగైరాల్లోవున్న భిన్నత్వం కారణంగా) మానవులమధ్య విభిన్నమయిన నీతులుండడానికి వీలులేదు. నీతులుండేది మనుషులకేకాని కులాలకూ-మతాలకూ, జాతులకూ-వర్గాలకూ కాదు. మనుషుల అభిప్రాయాల్లో, అలవాట్లలో, ఆకార వికారాల్లో యితర అంతరాల్లోవుండే భిన్నత్వం పాశవిక నీతికీ, అసహనానికీ దారి తీయరాదు.

కల్తీలేని "పరిశుద్ధ" జాతి మత వర్గాలనేవి యీనాడులేవు. ఈనాటి జాతులన్నీ రక్త సాంకర్యం పొందినవే. మతాలన్నీ సిద్ధాంత సాకర్యం పొందినవే. వర్గాలన్నీ ఆర్థికస్థాయీ సాంకర్యం పొందివున్నవే. భిన్న జాతి మత వర్గాలమధ్య స్పష్టమయిన విభజన రేఖగీయడం సాధ్యంకాదు. అందువల్ల జాతి, మత, వర్గాల పేర్లతో మనుషుల్ని విభజనచేయడం అహేతుకం. ఆ అహేతుక విభజనను సృష్టించినవారు ఆయాకాలాల్లో పాలకవర్గాలుగా (శాసకులుగా) పెంపొందినవారే. వారు చిరంతన సత్యాలుగా రూపొందించిన సిద్ధాంతాలన్నీ మానవుణ్ణి పెంపుడు జంతువుగా, సిద్ధాంతదాసుడుగా, డూడూబసవన్నగా తయారుచేయడానికే దారితీసినై. కానీ, మనిషి పెంపుడు జంతువుకావడానికి స్వభావతః యిచ్చగించడు కనుకనే, యెప్పటికప్పుడు వ్యవస్థీకృత సిద్ధాంతాలమీద తిరుగుబాటుచేస్తూ వచ్చాడు; అదే భావవిప్లవమంటే.

హేతువాదం మనిషిని అతని మొత్తం అస్తిత్వంలో చూడాలంటుంది కాబట్టి, అది మానవవాదంలో తేలుతుంది. మనిషి సర్వ

సమగ్రమయిన వికాసాన్ని పొందడం హేతువాదలక్ష్యం. మనుషులంతా వివేచనాపరులుగా వుండాలనేదే దాని ఆదర్శం. మేధావులనబడేవారు (అధికారులూ, సంపన్నులూకూడా) మనుషుల్ని వస్తువులుగామార్చి "వాడుకోవడాన్ని" హేతువాదం అంగీకరించదు. మతం ప్రారంభంలో యెలా పుట్టినప్పటికీ, చివరకు దానిలక్ష్యం మనిషిని పనిముట్టుగా మార్చి వేయడమే అయిపోయింది. భగవత్కైంకర్యంలోని ఆత్మార్పణ భావంలో ఐచ్ఛిక బానిసత్వం తప్ప స్వేచ్ఛాభావంలేదు. (కింకరుడి భావార్థం కైంకర్యమే) అందువల్ల మతంలోని మానవుడి లక్ష్యం మనిషికాదు. లక్ష్యాన్ని మనిషినుంచి మరొకదానికి మార్చే యే సిద్ధాంతమయినా మతమే అవుతుంది. అందువల్ల మనుషులయినవారి మార్గం హేతువాదమేకాని మతంకాదు; ఆధునిక విజ్ఞానంతో అలంకరించుకొనే నవ్యమతవాదం మానసిక వికారమేకాని, అందులో హేతువాద పద్ధతిలేదు-విజ్ఞానమార్గమూ లేదు.

అంటే, మనం హేతుపద్ధతిని అనుసరిస్తున్నామంటే మనుషులు కాకుండా వుండడానికి మనం అంగీకరించడంలేదనే అర్థం. మనిషిని పశువునుంచి వేరుచేసే మౌలికాంశం వివేచన. అందరూ ఆమోదించే యీ సత్యం మనకు నివేదించి, నిర్దేశించే మార్గం హేతువాదమే.

అంటే-హేతువాదమనేది పచ్చితర్కం (Dry logic) కాదు. దాని మీమాంసకు కేంద్రం మనిషి. ఆ మనిషి మనుగడను నిర్ణయిస్తున్న బహుళాంశాలను హేతువాదం శాస్త్రం ఆధారంగా అర్థంచేసుకొంటుంది. శాస్త్రప్రయోగాలకు అందని విషయాలను శాస్త్రీయ బుద్ధితో పరిశీలిస్తుంది. మతకేంద్ర దృక్పథంనుంచి మనిషిని మరల్చడంలో వ్యతిరేకాంశాలకు

(negative aspects) ప్రాధాన్యత యిచ్చినప్పటికీ. లౌకికదృక్పథాన్ని యెన్నుకోవడంలో అనుకూలాంశాలకు (Positive aspects) దారి చూపుతుంది. మతంలేకున్నా మనిషి బ్రతకగలడుకాబట్టి, దానిఖాళీని పూర్తిచేయగల ప్రత్యామ్నాయమేమిటి అనే ప్రశ్న అసందర్భం. మనసుకుపట్టిన మకిలెను వదలించుకోమంటే, తిరిగి ఆ మనసుకు యేమి పట్టించుకోవాలి అనే సమస్య వుత్పన్నంకాదు. అహేతుకతను నిరాకరించడంలోనే సహేతుకాంశాల నిష్పన్నత యిమిడివుంది. మతంలాగా హేతువాదం విధినిషేధాలను విధించదు. అందువల్లనే అదిమతంగా మారిపోదు. విజ్ఞానాభివృద్ధితోపాటు పరిణామంచెందే ఆలోచనావైఖరిగానే హేతువాదం వన్నెతేలుతుంది. ఆలోచనలోను, ఆచరణలోను అదొక ఉద్యమం. అందుకే ఎలెన్‌రాయ్ ఇలా అంటుంది.

A rationalist movement is by its nature a movement of ideas. But its task is not an academic one. It is eminently concerned with the life of the people, of the whole community, in all its aspects. Its task is to show the approach of reason to all problems of individual and social life. It has a role to play in the public life of the country. It must criticise what is bad and wrong in our society by showing that it is not reasonable, and apply reason as the measure of all improvements which are suggested.

చదవండి !

చదివించండి !!

# హేతువాది

## తెలుగు మాసపత్రిక

ఎడిటర్ : రావిపూడి వెంకటాద్రి

**చీరాల – 523 155**

సుందరయ్య గ్రంథాలయం
A C No. 81045
హైదరాబాద్-500 044.

# హేతువాది సాహిత్యం

| | | | |
|---|---|---|---|
| 1. | విశ్వాన్వేషణ – | రావిపూడి వెంకటాద్రి | రు. 5-00 |
| 2. | జీవమంటే ఏమిటి ? | ,, | 5-00 |
| 3. | ఇస్లాం-ఒక అంచనా | ,, | 1-00 |
| 4. | నాస్తికత్వం-నాస్తితత్వం | ,, | 12-00 |
| 5. | విశ్వతత్వం | ,, | 12-00 |
| 6. | భావవిప్లవం-వర్గచైతన్యం | ,, | 10-00 |
| 7. | రాడికల్ హ్యూమనిజం | ,, | 7-00 |
| 8. | మార్క్సిస్టు వాస్తవికత | ,, | 7-00 |
| 9. | మార్క్సిస్టు గతితర్కం (బులెటిన్స్) | ,, | 8-00 |
| 10. | ఎం. ఎన్. రాయ్-భారత కమ్యూనిజం | ,, | 45-00 |
| | ,, లైబ్రరీ ఎడిషన్ | ,, | 60-00 |
| 11. | హేతువాదపై ఝరి | ,, | 10-00 |
| 12. | హేతువాది (82-83) 1వ సంపుటం | ,, | 25-00 |
| 13. | ,, (83-84) 2వ సంపుటం | ,, | 30-00 |
| 14. | హేతువాదం | ,, | 2వ ముద్రణలో |
| 15. | Life and Soul | ,, | ,, |
| 16. | మానవుడు-సమాజం-ప్రకృతి | ,, | ,, |
| 17. | మార్క్సిస్టు భౌతికవాదం | ,, | ,, |
| 18. | ఆధునిక విజ్ఞానం | అరమళ్ళ పూర్ణచంద్ర | 10-00 |
| 19. | హేతువాదం-భావవిప్లవం | జి. వీరన్న | 5-00 |
| 20. | శుక్రనీతి-మానవనీతి | కొల్లా సుబ్బారావు | 2-00 |
| 21. | ఆలోచనా తరంగాలు | యం.వి. రామమూర్తి | 12-00 |
| 22. | భావవీచికలు | ,, | 12-00 |

## హేతుత్వం-మతతత్వం  వెల రూ. 3-00

హేతువాదం హేతువుయొక్క సర్వాధిక్యతను నిర్నిబంధంగా ఆమోదిస్తుంది. అన్ని రకాల అహేతుక భావనలకూ, ప్రమాణాలకూ దూరంగా వుంటుంది. అనుభవంద్వారా మాత్రమే నిరూపణ చేసుకో దానికి వీలయిన తత్వజ్ఞానాన్నీ, నీతిశాస్త్రాన్నీ నిర్మించుకోవడం లక్ష్యంగా కలిగివుంటుంది. శాస్త్రీయ దృక్పథం దాని జీవనాడి. అదొక వైఖరేకాని పిడివాదంకాదు. అది ఈ ప్రపంచ అస్తిత్వాన్ని ఆమోదిస్తుంది. దీనికి అతీతంగా మరేదైనా వుండగలదనే మూఢనమ్మకాన్ని నిరాకరిస్తుంది. అభౌతికతను తిరస్కరిస్తుంది. ఫలితంగా దైవం, ఆత్మ, అతీంద్రియశక్తులు, పునర్జన్మ, పరలోకాలు మొదలైన నమ్మకాలు ఎగిరిపోతాయి. ఈ లోకం, ఈ జన్మ మాత్రమే నిలబడతాయి. మంచి చెడ్డలు, వాటి ఫలితాలు ఈ లోకానికి సంబంధించినవే అవతాయి. ఏనాడూ రుజువుకాని దైవాన్ని పట్టుకొని ప్రేలాడే మతం మానవుడి మనస్సును శైశవంలో వుంచడానికే కృషిచేస్తున్నది. దానికి భిన్నంగా హేతువాదం ఏమి చెపుతుందో సూచించే వ్యాసవాణి "హేతుత్వం-మతతత్వం"